సాక్షి
కుమురం భీం

ఆదివారం । 23 । జూన్ । 2024



అలుపెరుగని అథ్లెట్

సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మడివల్లి రాజకొమురయ్య అథ్లెట్‌గా, యోగా గురువుగా ప్రశంసలందుకుంటున్నారు. ఇల్లు లేదా స్టేడియంలో నేటికీ సాధన చేస్తున్నారు. 8లో▸



పశువైద్యకేంద్రాలపై పట్టింపేది?

జిల్లాలోని పలు మండలాల్లో పశువైద్య కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. సరిపడా సిబ్బంది, ఆస్పత్రి భవనాలు లేక పశువులకు సరైన వైద్యం అందడంలేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో అక్కడక్కడా వానలు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

వాంకిడి సీఐ శ్రీనివాస్ బదిలీ

వాంకిడి: మల్టీ జోన్–1 పోలీస్ శాఖలో జరిగిన బదిలీల్లో వాంకిడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన బగ్గాని శ్రీనివాస్‌ను కరీంనగర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్–2లో విధులు నిర్వర్తించిన కే పురుషోత్తంను సీఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్‌కు ఉచిత కోచింగ్‌కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ (బీసీ–ఈ)తో పాటు దివ్యాంగులైన అభ్యర్థులు ఈనెల 17 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొననారు. 100 మంది అభ్యర్థుల ఎంపిక కోసం జులై 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 10 నెలల రిసిడెన్షియల్ ఉచిత కోచింగ్ ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు http@tsstudycircle.inవెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

డీజీబీలో మోగిన సైరన్



ఎల్కపల్లిలోని దక్కన్ గ్రామీణ బ్యాంక్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఎమర్జెన్సీ సైరన్ మోగింది. బ్యాంక్‌లో సుమారు 3గంటల ప్రాంతంలో సైరన్ మోగడంతో స్థానికులు బ్యాంకులో దొంగలు చొరబడ్డారనే అనుమానంతో 100కు డయల్ చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎస్సై కొమురయ్య బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్‌రావుకు సమాచారమిచ్చారు. పోలీసుల సాయంతో బ్యాంక్ అధికారులు తాళాలు తెరిచారు. బ్యాంక్‌లో తనిఖీలు నిర్వహించారు. బ్యాంక్‌లో దొంగలు ప్రవేశించిన ఆధారాలు లభించలేదు. బ్యాంక్‌లోని ఎమర్జెన్సీ అలారంపై బల్లి పడటంతో అది మోగినట్లు సిబ్బంది, పోలీసులు నిర్ధారించగా స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న శివప్రసాద్, ఉత్తమ్‌నాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్‌గా మండలానికి చెందిన బాధవత్ శివప్రసాద్, రాష్ట్ర కోకన్వీనర్‌గా రాథోడ్ ఉత్తమ్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన సేవాలాల్ సేన రాష్ట్ర విస్తృత సమావేశంలో శివప్రసాద్, ఉత్తమ్‌నాయక్ సేన వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు భూక్యా సంజీవ్ చేతులమీదుగా నియామక పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శివప్రసాద్, ఉత్తమ్‌నాయక్ మాట్లాడుతూ.. జులై 6న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సేవాలాల్ సేన విస్తృత సమావేశానికి జాతీయ అధ్యక్షుడు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రానికే మణిహారంగా ఉన్న సింగరేణి సంస్థను దివాళా తీయించేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ ఆరోపించారు. బొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణిపై కేంద్రం అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు గనుల శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లోనే ఈ ప్రక్రియ ప్రారంభించడం, ఇందులో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాల్గొనడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఇప్పటికైనా వేలం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు టీకానంద్, కార్తీక్, నిఖిల్, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సులు భద్రమేనా?



- జిల్లా వ్యాప్తంగా 86 స్కూల్‌బస్సులు
- ఇప్పటిదాకా 69 వాహనాలకే పరీక్షలు
- నిర్లక్ష్యం చేస్తున్న యాజమాన్యాలు

ఆసిఫాబాద్: వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమై పక్షం రోజులైంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నాయి. గడువు ముగిసినా వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి సర్టిఫికెట్లు పొందలేకపోయాయి. దీంతో పలు ప్రైవేట్ స్కూల్ బస్సులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. గతంలో జిల్లాలోని పాఠశాలల బస్సులు ప్రమాదాలకు గురైన సంఘటనలెన్నో ఉన్నాయి.

అధికారుల తనిఖీలు అంతంతే..

రవాణాశాఖ అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే ఉండడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలపై అలసత్వం వహిస్తున్నాయి. కొన్ని బస్సులు ఫిట్‌గా ఉండగా, మరికొన్నింటి సామర్థ్యం అంతంతమాత్రమే. ఏటా మే 15న ఫిట్‌నెస్ పరీక్షల గడువు ముగుస్తుంది. 16వ తేదీ నుంచి అధికారులు తనిఖీలు చేసి వచ్చే ఏడాదికి ఫిట్‌నెస్ ఇస్తారు. కొన్ని బస్సులకు ఫిట్‌నెస్ విషయంలో యాజమాన్యాలు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

ఇవీ.. నిబంధనలు..

ఎంవీఐ రూల్ 185 (జీ) ప్రకారం పాఠశాలల యాజమాన్యాలు సుమారు 32 నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. సంబంధిత వెబ్‌సైట్‌లో స్కూలు వివరాలు నమోదు చేయాలి. స్కూల్ అడ్రస్, సెల్ నంబర్, బస్సు నంబర్, డ్రైవర్, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జి, ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లతో పాటు వాహన వివరాలు పొందుపరచాలి. బస్సులో ఉండే అటెండర్ పేరు, వయస్సు, ప్రయాణించే విద్యార్థుల సంఖ్య నమోదు చేయాలి. బస్సు ఎక్కే మెట్లు ఫుట్‌బోర్డు నుంచి 325 మిల్లీ మీటర్లకు మించి ఉండకూడదు. ఫుట్‌బోర్డు వద్ద పిల్లలు ఎక్కి, దిగేందుకు అనుకూలంగా రెయిలింగ్ ఉండాలి. పవర్ స్టీరింగ్ ఉండాలి. డాష్‌పానల్ బోర్డుపై ఎడమ, కుడి ఇండికేటర్ ఉండాలి. ఎయిర్‌ప్రెజర్ గేజ్, ఫెయిల్స్ సేఫ్టీ ఇండికేటర్, బ్రేకుల్లో లోపాలు తెలిపే ఇండికేటర్, ఎయిర్ ప్రెజర్ గేజ్, ఫ్యూయల్ మీటర్, స్పీడోమీటర్, డ్రైవర్ సీటు పక్కన ఎయిర్ హ్యాండ్ బ్రేక్, హ్యాండ్ లివర్ గైడ్ స్ప్రింగ్, గేర్ లివర్‌లో అంతర్గత స్ప్రింగ్, పిల్లల కదలికలు తెలుసుకునేందుకు రెండు వైపులా అద్దాలు ఉండాలి. అగ్నిమాపక సిలిండర్ పౌడి, తలుపులకు సురక్షిత లాకింగ్ సిస్టం, సీట్ల కింద విద్యార్థుల లగేజీ బాక్సులు, పార్కింగ్ సిగ్నల్ లైట్లు పని చేస్తూ ఉండాలి. అత్యవసర ద్వారం వద్ద సురక్షితమైన అద్దం ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో పగులగొట్టేందుకు అక్కడ సుత్తి అందుబాటులోఉండాలి. సైడ్ విండోలకు మధ్యలో 31 అంగుళాలకు మించకుండా మూడు లోహపు కడ్డీలు ఏర్పాటు చేయాలి. సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించుకోరాదు. విద్యార్థులు నిలబడి ప్రయాణం చేయరాదు, అటెండర్ ఎట్టి పరిస్థితుల్లో మద్యం, ధూమపానం సేవించరాదు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలి.

తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి

విద్యార్థుల తల్లిదండ్రులు బస్సుల కండిషన్ గురించి తరచూ తెలుసుకుంటూ ఉండాలి. తమ పిల్లలు నిత్యం రాకపోకలు సాగించే బస్సుల విషయంలో యాజమాన్యాలు నిబంధనలు పాటిస్తున్నాయో.. లేదో తెలుసుకోవాలి. డ్రైవర్ అటెండెంట్ ప్రవర్తనగ మనిస్తూ ఉండాలి. డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నారా? నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నారా?, పిల్లలు ఎక్కేటపుడు, దిగేటప్పుడు అటెండెంట్ బాధ్యతగా ఉంటున్నారా? డ్రైవర్, అటెండెంట్ తీరును ఎప్పటికప్పుడు పిల్లలను అడిగి తెలుసుకోవాలి. సమస్యలుంటే రవాణాశాఖ, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

ఫిట్‌నెస్ పరీక్షకు 69 బస్సులే..

తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. ఈ సమయంలో ప్రైవేట్ పాఠశాలల బస్సులకు అవసరమున్న రెన్యూవల్స్, బస్సుల మరమ్మతు, బస్సుల ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాల్సి ఉంటుంది. పాఠశాలలు తెరిచేనాటికి బస్సులు ఫిట్‌గా ఉండే బస్సులను విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా యాజమాన్యాలు దృష్టి సారించాలి. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 86 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులుండగా, ఇప్పటివరకు 69కి మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించారు.

డ్రైవర్ అర్హతలివే..

18 సీట్ల లోపు సామర్థ్యం కలిగిన స్కూల్ వ్యాన్, బస్సు డ్రైవర్లకు ఎల్ఎంవీ ట్రాన్స్‌పోర్టు లైసెన్స్, బ్యాడ్జి ఉండాలి. 20 సీట్లు దాటిన బస్సులు నడపడానికి హెచ్‌టీవీ బ్యాడ్జి లైసెన్స్ ఉండాలి. వాహనాల సీట్లు, సామర్థ్యాన్ని బట్టి డ్రైవర్‌ను ఎంపిక చేయాలి. లైసెన్స్ వివరాలు రవాణాశాఖ వెబ్‌సైట్‌లో ఉండాలి. బస్సు, డ్రైవర్, అటెండెంట్ ఆరోగ్యంగా ఉండాలి. 18 నుంచి 60 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలి. వీరికి ప్రతీ మూడు నెలలకు స్కూలు యాజమాన్యం సొంత ఖర్చులతో బీపీ, మధుమేహం, గుండె, కంటి పరీక్షలు చేయించాలి. విద్యార్థులు బస్సు ఎక్కి, దిగే సమయంలో అటెండెంట్ దగ్గరుండి సహాయ పడాలి.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు నడిపితే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటివరకు జిల్లాలోని 69 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చాం. మిగతా బస్సులకూ ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకొని అనుమతి పత్రాలు తీసుకోవాలి. 15 ఏళ్లు దాటిన బస్సులు తిరగడానికి అవకాశం లేదు. విద్యార్థుల భద్రతకు ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బస్సులకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

– రాంచందర్, జిల్లా రవాణాశాఖ అధికారి

సివిల్ సర్వీస్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సివిల్ సర్వీసెస్ లాంగ్‌టర్మ్ 2025 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హాజరుకానున్నవారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సత్యనారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ అభ్యర్థులు ఈనెల 19నుంచి జులై 3వ తేదీ వరకు www.tgbcstu dycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 040–24071178 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. జులై 18 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో 100 మందిని 2024 జులై 7న నిర్వహించనున్న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇంతకుముందు యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 50 మంది అభ్యర్థులను తీసుకోనున్నట్లు తెలిపారు. సంబంధిత పత్రాలతో జులై 3లోపు టీజీబీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్ కాలనీ, హైదరాబాద్–500059 చిరునామాకు దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైనవారికి వసతి, భోజన, రవాణా సదుపాయం కోసం నెలకు రూ.5వేలు, బుక్స్‌కు మరో రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ వసతి ఉంటుందని పేర్కొన్నారు.

సమష్టి కృషితో జిల్లా అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమీక్ష

ఆసిఫాబాద్: సమష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు ప్రత్యేక మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు యూనిఫాంలు అందిస్తున్నామని తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం దిశగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీల్లో వైద్యసేవలందిస్తూ.. ఉచితంగా మందులు ఇస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్త్రీశక్తి ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రుణాలిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన జోడేఘాట్, మార్లవాయి, చింతలమాదర, గుండాల, మిట్టె జలపాతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజాసంక్షేమానికి అధికార యంత్రాంగం సమష్టి కృషి చేస్తోందని వివరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో తుకారాం, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, డీఈవో అశోక్, డీపీవో భిక్షపతి, డీఆర్డీవో సురేందర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముస్కాన్ బాలి, శ్యామ్, కార్తీక్, శ్రీనివాసన్, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి



వాంకిడి: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

వాంకిడి: మాదక ద్రవ్యాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కే యువరాజ సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'మాదక ద్రవ్యాల దుర్వినియోగం–అక్రమ రవాణా' కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రభుత్వాలు, కుటుంబాలు, వ్యక్తులు అంతా కలిసి పనిచేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల వాడకంతో మానవ శరీరం పనికి రాకుండా పోతుందని తెలిపారు. జిల్లాలో గంజాయి వాడకం అధికంగా ఉందని, కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వాడకంతో సమాజంలో అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంజేశారు. విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని, ర్యాగింగ్ ఈవ్‌టీజింగ్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అంజనాదేవి, ఎస్సై సాగర్, కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: మాదకద్రవ్యాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సివిల్ జడ్జి యువరాజ సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 26న నిర్వహించనున్న మాదకద్రవ్యాల నివారణ దినోత్సవంలో భాగంగా వారంపాటు నిర్వహించే వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంతో శరీరం కృషించిపోతుందని తెలిపారు. వీటి వాడకంతో సమాజంలో రోజురోజుకూ నేరప్రవృత్తి పెరుగుతోందని ఆందోళన వ్యక్తంజేశారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ అంజనాదేవి, ప్రిన్సిపాల్ శ్రీనాథ్, కనకయ్య, ఎస్సై సాగర్, అడ్వకేట్లు పాల్గొన్నారు.

చిన్నారులకూ యూనిఫాం

- 8,118 మందికి ఇచ్చేందుకు కసరత్తు
- జూలై మొదటివారం నుంచే పంపిణీ
- ఇప్పటికే జిల్లాకు చేరిన ముడివస్త్రం
- మహిళాశక్తి సంఘాలకు బాధ్యతలు



ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినూత్న పథకాలు అమలు చేస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులకు ప్రీప్రైమరీ విద్యాబోధన చేయనున్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరం నుంచి అంగన్‌వాడీ చిన్నారులకు ఉచితంగా యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.

436 కేంద్రాలు.. 8,118 మంది చిన్నారులు

జిల్లాలోని 15 మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐదు ప్రాజెక్టులుగా విభజించారు. ఈ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో 0 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 21,308 మంది ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 436 కేంద్రాల్లో 8,118 మంది ఉన్నట్లు గుర్తించి ఐసీడీఎస్ అధికారులు నివేదికలు అందజేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందించేది. ఈ సంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చే క్రమంలో 3 నుంచి 6 ఏళ్లలోపు ఉన్న వారికి ఉచిత యూనిఫాంలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు అవసరమయ్యే వస్త్రాన్ని జిల్లా సంక్షేమాధికారులకు అందించింది.

కుట్టు బాధ్యత మహిళాశక్తి సంఘాలకు..

అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు యూనిఫాంలు కుట్టి అందించాలని మహిళా శక్తి సంఘాలకు బాధ్యతలు అప్పగించారు. యూనిఫాంకు సంబంధించిన డిజైన్‌లను ఎంపిక చేసి అందించారు. మగ పిల్లలకు నిక్కర్, షర్ట్, ఆడ పిల్లలకు ఫ్రాగ్ కుట్టాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు, డీఆర్‌డీఏ అధికారులు (సెర్ప్) మహిళా శక్తి సంఘాలకు యూనిఫాం క్లాత్ అందించనున్నారు. విద్యార్థులకు సంబంధించిన కొలతలను సంవత్సరాల వారీగా నిర్ణయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫాం కుట్టించి ఇవ్వడంతో మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా కలగనున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేసి జులై మొదటి వారంలో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

యూనిఫాంలు పంపిణీ చేస్తాం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు యూనిఫాంలు కుట్టించాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా, మండల సమాఖ్య మహిళా సంఘాలకు బాధ్యతలు ఇస్తాం. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాంలు కుడుతుండడంతో కొంత ఆలస్యం అవుతుంది. సంఘాలకు యూనిఫాం క్లాత్ అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. వీలైనంత త్వరగా చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేస్తాం.

– భాస్కర్, జిల్లా సంక్షేమాధికారి

25న కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు

ఆసిఫాబాద్‌అర్బన్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలోని పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని రైతువేదికలో ఈనెల 25వ తేదీన కొబ్బరి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఉద్యానవన శాఖ అధికారి గుడిమల్ల సందీప్ శనివారం ఓ ప్రకటలో తెలిపారు. కొబ్బరి అభివృద్ధి సంస్థ–విజయవాడ, ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో కొబ్బరి సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, పంట సాగుకు రాయితీలు, సాగు విధానాల గురించి సంబంధిత శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు అధికసంఖ్యలో పాల్గొని కొబ్బరి సాగుపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకుని, మెళకువలు తెలుసుకోవాలని సూచించారు. జిల్లా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించాలనే ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచనతో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొబ్బరి అభివృద్ధి సంస్థ, ఐటీడీఏ అధికారులు, వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొంటారని వివరించారు.

అద్దె గదుల వేలం

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ అద్దె గదులకు శనివారం పంచాయతీ ప్రత్యేకాధికారి గంగాసింగ్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఆరు గదుల ద్వారా ఏడాదికి రూ.5,18,400 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. వేలంలో గదుల ను దక్కించుకున్నవారు రెండునెలల అద్దె ముందుగా పంచాయతీకి చెల్లించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులపై అటవీ అధికారుల పెత్తనమేంటి?



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: గత 70 ఏళ్ల నుంచి ఏజెన్సీ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న భూములపై అటవీశాఖ అధికారుల పెత్తనం ఏమిటని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కనక మోతీబాయి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాగల్‌కొండ గ్రామ శివారులో ఉన్న 67 సర్వే నంబర్ గల భూమిలో దాదాపు 3 వేలకు పైగా ప్రభుత్వ భూమి ఉందని తహసీల్దార్ జాడి రాజలింగు తెలిపారు. అందులో 60 ఏళ్లుగా కొంతమంది సాగు చేసుకుంటున్నారని వివరించారు. అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ భూమి అంటూ రైతులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూమి అని రెవెన్యూ రికార్డులు చెబుతున్నప్పటికీ అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే చైర్మన్ జోక్యం చేసుకొని ఏజెన్సీ ప్రాంతంలో రైతులు సాగుచేసే భూమి విషయంలో అటవీ అధికారులు రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. అన్నిశాఖల అధికారులు సమయపాలన పాటించడం లేదని, సభ్యులు ఆరోపించారు. అధికారులు అంకితభావం, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. గిరిజన గ్రామాలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఐటీడీఏ ఏఈ సునీల్ రాథోడ్‌ను కోరారు. సమావేశంలో ఎంపీపీ కనక మోతీబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, ఎంపీడీవో జవహర్, ఐటీడీఏ డీఈ శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

వేమనపల్లి: ఈ నెల 19న అర్ధరాత్రి దస్నాపూర్ శివారులోని తాటివనం వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. పక్కా సమాచారంతో పేకాట స్థావరంపై దాడిచేయగా పారిపోయిన 15 మందిని శనివారం అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి మళ్లీ పేకాట ఆడకుండా ఉండేలా తహసీల్దార్ రమేశ్ ఎదుట లక్ష రూపాయల పూచికత్తుపై బైండోవర్ చేశామన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

జన్నారం: జన్నారం గ్రామ పంచాయతీ పరిధిలో ఆస్తి తగాదాల్లో దాడి చేసిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. జన్నారం గ్రామ పంచాయతీకి చెందిన ముజీబొద్దీన్, అతని సోదరుడు ఫహీమొద్దీన్ శుక్రవారం రాత్రి ఆస్తి విషయంలో గొడవ పడ్డారు. ముజీబొద్దీన్, ఎజాస్ ఇద్దరూ కలిసి ఫహీమొద్దీన్‌ను అతని భార్యపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


ఆత్రం గణేశ్(ఫైల్)

తిర్యాణి: గుర్తు తెలియని పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గుండాల గ్రామానికి చెందిన ఆత్రం గణేశ్ (20) కొంతకాలంగా దండెపెల్లి మండలం కర్ణపేట గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఈనెల 21న గ్రామ శివారులోని మామిడి తోట లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్సకోసం వరంగల్‌లోని ఎంజీఎంకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. దండెపెల్లి పోలీసులను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


పాతమంచిర్యాల: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రజకులు 18 రాష్ట్రాలలో ఎస్సీ జాబితాలో ఉండగా 11 రాష్ట్రాలలో అందుకు భిన్నంగా ఉన్నారన్నారు. సమావేశంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగెళ్లపల్లి తిరుపతి, యూత్ గౌరవ అధ్యక్షుడు సంగెపు ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు సంగెపు లక్ష్మణ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కొమురయ్య, కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

అలు పెరుగని అథ్లెట్..!

అతను సింగరేణి మాజీ కార్మికుడు. సంస్థలో జనరల్ మజ్దూర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. ఉద్యోగ రీత్యా రిటైర్డ్ అయినఆ శారీరక ధృఢత్వంతో వృద్ధాప్యానికి సవాల్ విసురుతున్న అలుపెరుగని అథ్లెట్ ఆయన. అంతే కాదు యోగాలో కూడా జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చి పలు బహుమతులు, అవార్డులు సొంతం చేసుకున్న విజేయుడు. అతనే రామకృష్ణాపూర్‌లోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన మడిపల్లి రాజకొమురయ్య. అటు అథ్లెట్‌గా యోగా గురువుగా పలువురి ప్రశంసలు అందుకుంటున్న రాజకొమురయ్య ఇప్పుడు అందరి నోళ్లలో నానుతున్నారు. ఇల్లు.. లేదంటే స్టేడియమే నిలయాలుగా సాధన చేస్తున్న రాజకొమురయ్యపై ప్రత్యేక కథనం.

- యోగాలోనూ జాతీయ స్థాయిలో ప్రతిభ
- పలు అవార్డులు సొంతం చేసుకున్న రాజకొమురయ్య
- ఇంట్లో ధ్యానం..స్టేడియంలో కసరత్తు ఆయన దినచర్య


బహుమతి అందుకుంటున్న రాజకొమురయ్య (ఫైల్)


యోగా సాధన చేస్తున్న రాజకొమురయ్య

రామకృష్ణాపూర్: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ ఏరియాకు చెందిన మడిపల్లి రాజకొమురయ్య సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహించేవాడు. జనరల్ మజ్దూర్‌గా పనిచేసిన ఆయన మందమర్రి ఏరియాలోని కేకే5 గనిలో 2019లో ఉద్యోగ విరమణ పొందాడు. రిటైర్ అయ్యాడన్న మాటేగానీ ఇప్పటికీ నిత్య యువకుడిగానే దర్శనమిస్తాడు. ప్రతీరోజు క్రమం తప్పకుండా స్టేడియానికి రావటం ఆనవాయితీగా పెట్టుకున్నాడు. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తూ శారీరక ధృఢత్వంతో ముందుకు పోతున్నారు. వెటరన్ ఆటగాడిగా పోటీల్లో పాల్గొంటూ అథ్లెట్‌గా రాణిస్తున్నాడు. 60 ఏళ్లకు పైబడిన వారికి నిర్వహించే అథ్లెటిక్ పోటీల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు.

సాధించిన బహుమతులు

- 2011లో వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ తమిళనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 50 ఏళ్ల విభాగంలో 5000 మీటర్ల వాక్‌లో ప్రథమ బహుమతి సాధించాడు.
- అదే సంవత్సరం వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ పుదుచ్చేరి వారు నిర్వహించిన 31వ వెటరన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 50 ఏళ్ల వయసు విభాగం 5000 మీటర్ల వాక్‌లో ద్వితీయ బహుమతి సాధించాడు.
- 2016లో హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 400 మీటర్ల పరుగులో ప్రథమ బహుమతి సాధించాడు.
- 2018లో యోగా ప్రచార సమితి, తెలంగాణ వారు హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ద్వితీయ బహుమతి సాధించాడు.
- 2019లో ఉస్మానియా యూనివర్శిటీలో నిర్వహించిన మొదటి అథ్లెటిక్ ఓపెన్‌మీట్‌లో 60 ఏళ్ల వయసు విభాగంలో 400 మీటర్ల పరుగులో ప్రథమ బహుమతి, అదే ఏడాది హెల్దీ సీనియర్ సిటిజన్స్ వారు హైదరాబాద్‌లో నిర్వహించిన 3000 మీటర్ల వాక్‌లో ప్రథమ బహుమతి సాధించాడు.
- 2020లో మందమర్రిలో నిర్వహించిన నేషనల్ లెవల్ యోగా ఛాంపియన్ షిప్ పోటీల్లో 61 ఏళ్ల వయసు విభాగంలో ద్వితీయ బహుమతి, 2022లో ఇండియన్ యోగా స్కూల్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాడు.
- 2023లో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన 4వ ఆలిండియా కాన్ఫరెన్స్‌లో బెస్ట్ యోగా మాస్టర్ అవార్డు అందుకున్నాడు.
- అదే ఏడాది బహుజన రైటర్స్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో క్రీడారత్న జాతీయ అవార్డు అందుకున్నాడు.
- ఇటీవల పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మొదటి ఫెడరేషన్ కప్ పోటీల్లో 65 ఏళ్ల వయసు విభాగంలో 3 కిలోమీటర్ల వాక్‌లో ద్వితీయ బహుమతి సాధించాడు.

ఆరోగ్యమే మహాభాగ్యం...

'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్న నానుడిని పరమావధిగా భావించే రాజకొమురయ్య యోగా వైపు కూడా దృష్టిసారించాడు. ప్రతీరోజు యోగాసనాలు అలవాటు చేసుకుని నేడు మంచి యోగా మాస్టర్‌గా కూడా ఎదిగాడు. యోగా విన్యాసాలతో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. రోజురోజుకు చురుగ్గా తన ప్రతిభా పాటవాలకు పదును పెడుతూ రెండు రంగాల్లోనూ విశేష అనుభవాన్ని సొంతం చేసుకున్నాడు. మాజీ సింగరేణి కార్మికుడి కంటే మంచి అథ్లెట్‌గా, యోగా రాజకొమురయ్య అంటేనే ఇప్పుడు తెలిసే స్థాయికి ఎదిగాడు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కౌటాల: సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైస్‌మిల్లు సమీపంలో శనివారం అనుమానాస్పదంగా ఒకరు మృతి చెందినట్లు ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం వజనపల్లికి చెందిన కొడెపాక వెంకటేశ్ (34) ఐదేళ్లుగా భార్యా పిల్లలతో కలిసి అత్తగారి ఊరైన మహారాష్ట్రలోని సిరోంచ మండలం కోటపోచంపల్లిలో ఉంటున్నాడు. టేకు కలప కొనుగోలు చేసి మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి కాగజ్‌నగర్ మీదుగా కోటపోచంపల్లికి బొలెరో వాహనంలో తరలిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం వేకువ జామున నిద్రపోవడానికి సిర్పూర్(టి) మండల కేంద్రానికి సమీపంలోని రైస్‌మిల్లు వద్ద కాగజ్‌నగర్- సిర్పూర్(టి) ప్రధాన రహదారి పక్కన వాహనం నిలిపి డ్రైవర్‌తో పాటు వెంకటేశ్, మరొకరు పడుకున్నారు. ఉదయం పెట్రోలింగ్ పోలీసులు వాహనం వద్ద కింద పడి మృతి చెందిన వెంకటేశ్‌ను గుర్తించారు. నిద్రమత్తులో బొలెరో వాహనం నుంచి పడి వెంకటేశ్ మృతి చెందాడా? లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని కౌటాల సర్కిల్ సీఐ సాదిక్‌పాషా, ఎస్సై దీకొండ రమేశ్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుని సోదరుడు కొడెపాక మల్లేశ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

'24న ధర్నా విజయవంతం చేయాలి'


మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

జన్నారం: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 24న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతామహాలక్ష్మి కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, సభ్యులు శైలజ, పద్మ, లక్ష్మి, కృప, రాజవ్వ, ఏసుమణి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, స్టోన్‌బస్ట్ తరలిస్తున్న లారీల పట్టివేత


పట్టుకున్న లారీతో మైనింగ్ ఏడీ గంగాధర్

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పుంజుమేరగూడ బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ పంపు వద్ద అక్రమంగా ఇసుక, స్టోన్‌బస్ట్ తరలిస్తున్న లారీలను పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ గంగాధర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి పెట్రోల్ పంపు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టుబడినట్లు తెలిపారు. లారీని స్వాధీనం చేసుకుని రెబ్బెన పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అదే సమయంలో కరీంనగర్ నుండి ఆసిఫాబాద్ వైపు స్టోన్‌బస్ట్ తరలిస్తున్న లారీని సైతం స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న లారీకి రూ. 74,000, స్టోన్‌బస్ట్‌తో పట్టుబడిన లారీకి రూ.7,020ల జరిమానా విధించి వాహనాలను రిలీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

చంపి బావిలో పడేశారు..

- మహిళతో ఏర్పడిన సాన్నిహిత్యమే కారణం
- రెండు నెలల తర్వాత వెలుగులోకి..
- వీడిన మానకొండూర్ యువకుడి అదృశ్యం మిస్టరీ


అనంతోజు సాయికిరణ్ (ఫైల్)


బావిలో నుంచి మృతదేహాన్ని తీస్తున్న దృశ్యం

దహెగాం: ఇద్దరి మధ్య ఏర్పడిన సాన్నిహిత్యం ఓ యువకుడి హత్యకు దారి తీసింది. సదరు మహిళను కలవడానికి వచ్చిన యువకుడిని ఆమెతోపాటు బంధువులు కొట్టి చంపి బావిలో పడేశారు. తన భర్త కనిపించడం లేదని అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చేపట్టిన విచారణలో విషయం వెలుగుచూసింది. రెండు నెలల తర్వాత కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన యువకుడి అదృశ్యం మిస్టరీ వీడింది. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలం బారెగూడెం గ్రామానికి చెందిన బట్టే శ్రీనివాస్, సునీత దంపతులు సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్‌లోని ఓ కోళ్లఫారంలో పని చేస్తుండేవారు. అదే కోళ్లఫారంలో మానకొండూరుకు చెందిన అనంతోజు సాయికిరణ్, అనూష దంపతులు కూడా నాలుగేళ్లుగా పని చేసేవారు. ఈ క్రమంలో సునీతతో సాయికిరణ్‌కు సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ విషయంలో సునీత భర్త శ్రీనివాస్‌తో గొడవలు జరిగాయి. దీంతో సాయికిరణ్ తన భార్యతో మానకొండూరుకు వచ్చి కట్టెకోత మిషన్‌లో పని చేస్తున్నాడు. ఏప్రిల్ 18న సాయికిరణ్ సిద్దిపేటకు వెళ్తున్నానని తన భార్యకు చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య అనూష మే 2న మానకొండూరు పోలీసుస్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. అదృశ్యంపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కొండాపూర్ నుంచి సునీత, శ్రీనివాసులు ఏప్రిల్ 18న సునీత తల్లిగారు ఊరు కుమురంభీం జిల్లా దహెగాంకు వచ్చారు. అదే నెల 19న సునీత కోసం సాయికిరణ్(29) దహెగాంకు రాగా ఆ రోజు రాత్రి సునీత, ఆమె భర్త, తండ్రితోపాటు మేనమామ కలిసి కర్రలతో కొట్టి చంపి పాడుబడ్డ బావిలో పడేశారు. పోలీసుల విచారణలో ఈ విషయం వెలుగు చూడడంతో బావిలో కుళ్లిపోయిన సాయికిరణ్ మృతదేహాన్ని శనివారం బయటకు తీశారు. నిందితులు నలుగురిపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు. సీఐ వెంట దహెగాం ఎస్సై రాజు ఉన్నారు.

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.ప్రవీణ్‌కుమార్, కోచ్‌లు ఎం.నాగలక్ష్మి, ఎం.సరీష్ తెలిపారు. ఎండి ఆఫ్రీన్, సీహెచ్.ప్రాన్సిస్, ఎస్.అవినాశ్, జి.మణిప్రియ, కే.ప్రవస్తి, ఎం.సాయి వెంకట్, అశ్రీత్, ఎం.సాయి అద్వేత, వి.షణ్ముక్, సీహెచ్.సమన్వి, ఎండీ అస్మా, ఎస్.మానివి బ్లాక్‌బెల్ట్, రెడ్‌బెల్టులు సాధించినట్లు వారు పేర్కొన్నారు.

అర్హతపత్రం అందజేయాలి

మంచిర్యాలఅర్బన్: ఈ విద్యాసంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు విక్రయించేందుకు అర్హత పత్రాలు అందజేయాలని డీఈవో యాదయ్య తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన క్వాటర్లీ రిటర్న్ టాక్సీ (కమర్షియల్‌టాక్సీ), ఆడిట్ రిపోర్టులతో రూ. 2వేలు డీడీ డీఈవో, మంచిర్యాల పేరిట డిపాజిట్ చెల్లించి ఈనెల 24 నుంచి 28 లోపు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జేసీబీ బకెట్ తాకి కూలీ మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేకే-1 గని ఫ్యాన్ సమీపంలో గల అటవీ ప్రాంతంలో జేసీబీ బకెట్ తాకి నైతం నవీన్ (35) అనే వలస కూలీ మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కొమురంభీం జిల్లా బెజ్జూర్ మండలానికి చెందిన నవీన్ కూలీ పని కోసం రామకృష్ణాపూర్ రోడ్డు పక్కన గల రాజేశం అనే ఇటుకల తయారీ వ్యాపారి వద్ద పనికి కుదిరాడు. శనివారం కేకే-1 ఏరియాలోని అటవీ ప్రాంతంలో చెక్ డ్యాం నిర్మాణ పనుల కోసం ట్రాక్టర్‌లో ఇసుక తీసుకెళ్తుండగా గోతిలో దిగబడింది. ట్రాక్టర్‌ను బయటకు తీయడానికి జేసీబీని తీసుకెళ్లారు. డ్రైవర్ జేసీబీని వెనక్కి తీస్తుండగా అక్కడే ఉన్న నవీన్‌కు ఛాతిలో బకెట్ బలంగా తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేసీబీ డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆందోళన బాటలో 'ఆదర్శ' ఉపాధ్యాయులు



కుంటాలలోని ఆదర్శ పాఠశాల

కుంటాల: ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ నెల 24 నుంచి 29 వరకు ఆందోళనల బాట పట్టనున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం రోజుకో రీతిన నిరసనలు తెలుపనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు ఉండగా అందులో సుమారు 160 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

డిమాండ్లు ఇవే..

- బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి.
- 010 పద్దు ద్వారా వేతనం చెల్లించాలి.
- హెల్త్ కార్డులు జారీ చేయాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి.
- కారుణ్య నియామకాలు చేపట్టాలి.

నిరసన కార్యక్రమాలు

- ఈ నెల 24న నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు.
- 25, 26 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసనతో పాటు సీఎంవో విద్యాశాఖ కార్యదర్శికి ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం.
- 27న తహసీల్దార్, మండల విద్యాధికారులకు వినపత్రాలు అందజేత.
- 28న కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి, 29న పాఠశాల విద్యాశాఖ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆదర్శ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కొన్నేళ్లుగా కోరుతున్నాం. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24 నుంచి 27వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం. అయినా స్పందించనిపక్షంలో ధర్నాకు పూనుకుంటాం.
– నందూక్వర్ ప్రవీణ్ కుమార్, మోడల్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కర్ర అవశేష శిలాజాలు పరిశీలన


పరిశీలిస్తున్న అధికారులు

తిర్యాణి: మండలంలోని గిన్నెదరి రేంజ్ పరిధిలోని పంగిడిమాదర బీట్‌లో శనివారం అటవీ శాఖ ఉన్నతాధికారులు, జియోలజిస్టులు పర్యటించి కర్ర అవశేష శిలాజాలు, నత్త అవశేష శిలాజాలు పరిశీలించారు. వాటితో పాటు వివిధ రకాల చెట్లు, ఆర్కిడ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంగిడిమాదర బీట్‌ను జీవ వైవిధ్య ప్రాంతంగా గురిస్తామన్నారు. ఫారెస్టు శాఖ ఎఫ్‌డీపీటీ శాంతారాం, సీనియార్ జియాలజిస్ట్ చక్రవర్తి, ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, గిన్నెదరి రేంజర్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు


సన్మానిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల టీఎన్జీవోస్ సభ్యులు శనివారం కేంద్ర హోంశాఖ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి అనుముల సతీశ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఉద్యోగాలు కాపాడుకోవాలి


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులు తమ ఉద్యోగాలు కాపాడుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఎస్సార్పీ1, ఎస్సార్పీ3, 3ఏ గనుల్లో గైరాజరైన కార్మికులకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ సంవత్సరంలో నిర్ణీత మస్టర్లు చేయకుంటే ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సింగరేణిలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఉన్న ఉద్యోగాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. 116 మంది గైర్హాజరు కార్మికులకు ఈ సందర్భంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎంలు చిరంజీవులు, అరవిందరావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

జన్నారం: ఉపాధి హామి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని మంచిర్యాల అదనపు డీఆర్‌డీవో దత్తారాం అన్నారు. గత ఆర్థిక సంవత్సరం 330 పనుల కోసం 5 కోట్ల 48 లక్షల 80 వేల 925 రూపాయలు వేతనాల రూపేణా, 14 లక్షల 94 వేల 980 రూపాయలు సామగ్రి రూపేణా ఖర్చు చేశారు. ఉపాధి హామి పనులపై ఈ నెల 9 నుంచి 21 వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ సరోజన అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించారు. మంచిర్యాల అదనపు డీఆర్‌డీవో హాజరయ్యారు. పలు గ్రామాల రికార్డుల్లో పనుల వివరాలు లేకపోవడం, మరి కొన్ని గ్రామాల్లో నాటిన మొక్కలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కలమడుగు, రేండ్లగూడ, మొర్రిగూడ, జన్నారం, కొత్తపేట, మల్యాల గ్రామాలు మినహా మిగతా 23 గ్రామాలలో జరిగిన పనులకు కలిపి రూ.84,500 రికవరీకి ఆదేశించారు. ఎనిమిది గ్రామాల్లో రికార్డుల్లో నమోదు కాని రూ.13 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, అంబుడ్స్ అధికారి శివరాం, ఎంపీవో రమేశ్, ఏపీవో రవీందర్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కిరణ్, సామాజిక తనిఖీ బృందం, కార్యదర్శులు పాల్గొన్నారు.



సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఏడీఆర్‌డీవో దత్తారాం